క్లుప్తంగా

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలి



కురవి: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ మండల కేంద్రంలోని భద్ర కాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారికి ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు శుక్రవారం రాత్రి ప్రదోషకాల పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రెడ్యాల శ్రీనివాస్, బాలకృష్ణ, శ్రీకాంత్, పుణ్యమూర్తి, సిబ్బంది రవి, సమ్మయ్య, వీరన్న, మణి పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం కోసం రేపటి నుంచి దీక్ష



గార్ల: గార్ల సమీపంలో పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టిబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి పాకాల ఏటి వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లాలోనే ప్రధాన సమస్య అయిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం దశాబ్దాల కాలంగా పాలకుల నిర్లక్ష్యంతో పెండింగ్‌లోనే ఉందన్నారు. దీక్షకు మండల ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాగం రమేశ్, పోతుల నర్సింహారావు, జనార్దన్, భీముడు, లోకేష్, రమేశ్, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి



నెహ్రూసెంటర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ అన్నారు. గిరిజనుల భూములను ప్రభుత్వం తీసుకుంటుంటే గిరిజన రైతులకు మద్దతుగా నిలిచిన కేసులో భాగంగా నాయకులు కోర్టుకు శుక్రవారం హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనుల కోసం పోరాటాలు చేయడంతో వారికి నష్టపరిహారం అందించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. రేషపల్లి నవీన్, శివాజీ, సురేందర్, మంగ్యా, వెంకన్న, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి రూ.9.46 కోట్ల మంజూరు

తొర్రూరు: తొర్రూరు పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.9.46 కోట్ల నిధులను మంజూరు చేసింది. పట్టణంలో మౌళిక సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించాలని గతంలో సీఎం రేవంత్‌రెడ్డిని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరిన విషయం తెలిసిందే. పట్టణంలో అసంపూర్తిగా మిగిలిన పలు పనుల పూర్తికి ఈ నిధులను వెచ్చించనున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...తొర్రూరు అభివృద్ధికి నిధులు అడిగిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేయడం ఆహ్వానించదగిందన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



మహబూబాబాద్ రూరల్: పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ టౌన్ మహిళా అధ్యక్షురాలు అనంతుల రాజమ్మ అన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్ కాలనీకి చెందిన రాపాక పద్మను 26వ వార్డు మహిళా అధ్యక్షురాలిగా శుక్రవారం నియమించారు. ఈసందర్భంగా అనంతుల రాజమ్మ మాట్లాడుతూ.. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నునావత్ రాధాబాయి ఆదేశాల మేరకు జిల్లా సెక్రెటరీ లింగోజి సరస్వతి ఆధ్వర్యంలో పద్మను నియమించామని తెలిపారు.

జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

గూడూరు: ఏజెన్సీ మండలంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు యాకాంబ్రం, సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. మానుకోటలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

కంకర పరిచారు.. తారు మరిచారు

- జీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం
- ఏడాదిన్నర కాలంగా ఎదురుచూపులు



కంకరపోసి వదిలేసిన రోడ్డు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని లక్ష్మీపురం(బ్రాహ్మణపల్లి) గ్రామంలో గల ఎస్టీ కాలనీ నుంచి రెడ్యాల గ్రామం వరకు నిర్మించతలపెట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా స్థానిక రైతులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు గ్రామాల రైతులు, ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవడంతోపాటు రాకపోకల్లో దూరభారం పడకుండా ఉండాలని ప్రభుత్వం ఆలోచన చేసి బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా లక్ష్మీపురం (బ్రాహ్మణపల్లి) గ్రామంలో గల ఎస్టీ కాలనీ నుంచి రెడ్యాల గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 అక్టోబర్ 4వ తేదీన అప్పటి ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ శంకుస్థాపన చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం నుంచి సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏ ఏటూరునాగారం నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఐటీడీఏ 2022–23 నిధుల్లో భాగంగా 3.5కిలోమీటర్ల మేరకు మూడు కోట్ల రూపాయల అంచనాతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. శంకుస్థాపన రోజున త్వరలోనే ఆ రోడ్డు నిర్మాణం పూర్తి జరిగి అందరికి అందుబాటులోకి వస్తుందని పేర్కొనగా, ఏడాదిన్నరకాలం పూర్తికావస్తున్నప్పటికీ కంకరపోసి బీటీ పోయకుండా వదిలివేయడంతో రైతులు, ప్రజలు, వాహనదారులు అటువైపుగా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారి కనీసం నడిచి వెళ్లలేని విధంగా తయారవుతుందని ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి



మా గ్రామం నుంచి రెడ్యాల గ్రామం వరకు ఏడాదిన్నర క్రితం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, కంకరపోసి రోడ్డు పోయడం వదిలేశారు. దీంతో రైతులు, ప్రజలు, వాహనదారులు అన్నిరకాలుగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేస్తే అందరికి సౌకర్యవంతంగా ఉంటుంది.

– మాలోత్ మంగిలాల్, లక్ష్మీపురం

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జేడీ రాజీవ్

గూడూరు: వేసవి సెలవుల్లో ఆరోగ్యం, ఆనందం కోసం ప్రభుత్వం చేపట్టిన సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జేడీ రాజీవ్, స్టేట్ జనరల్ కోఆర్డినేటర్ డాక్టర్ హాజారీ శిరీష అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోని సమ్మర్ క్యాంపులను శుక్రవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యాలయంలో ఇస్తున్నటువంటి సమ్మర్ శిక్షణ తరగతులపై విద్యార్థులను అడిగి తెల్సుకున్నారు. అనంతరం ఇదే విద్యాలయంలో 2024–25లో పదో తరగతి, ఇంటర్మీడియేట్‌లో విద్యాలయం మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, ఎఫ్ఏఓ బుచ్చయ్య, జీసీడీఓ విజయకుమారి, ఎస్ఓ సునిత, గంగారం ఎస్ఓ సుజాత, ఆర్పి యాకయ్య, పీటీఐ అమరేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

దంతాలపల్లి: మండలంలో రైతుల భూసమస్యలు పరిష్కరించేందుకే మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తొర్రూరు ఆర్డీఓ గణేశ్ అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల, బొడ్లాడ గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పేరుకుపోయిన భూసమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చిందని ఆర్డీఓ గుర్తుచేశారు. భూభారతి చట్టంలో భాగంగానే దంతాలపల్లి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మొదట మండలంలో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. కుమ్మరికుంట్ల గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు నిర్వహించి, సమస్యలను పరిష్కచాలని రైతులు కృష్ణయ్య, నర్సయ్య తహసీల్దారు సునీల్‌కుమార్‌కు వినతిపత్రం దరఖాస్తు అందించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

చిన్నగూడూరు: ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం తొర్రూరు డివిజన్ కార్యదర్శులు ఉడుగుల లింగన్న, ఇరుగు నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఉగ్గంపల్లి గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ నిధులను తగ్గిస్తూ పథకాన్ని రద్దు చేసే కుట్ర చేస్తుందన్నారు. జాబ్ కార్డు లేని ప్రతి ఒక్కరికి కార్డులు మంజూరు చేయాలన్నారు. కూలీలకు కనీస వేతనం కింద రూ.600 చెల్లించి ఉపాధి హామీ పని దినాలను 100నుంచి 200 రోజులకు పెంచాలని తెలిపారు. పని ప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్, టెంట్ వంటి కనీస సౌకర్యాలు ఉండే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎడ్ల మల్లయ్య, మాజీ సర్పంచ్ బీసు మంజుల, డీఎస్ వెంకన్న, ముత్యం అంబరీష, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



డోర్నకల్: తనిఖీ చేస్తున్న పోలీసులు



గార్ల: తనిఖీ చేస్తున్న ఎస్సై రియాజ్‌పాషా

డోర్నకల్: డోర్నకల్, ఖమ్మం మార్గంలో అమ్మపాలెం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం డోర్నకల్ పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. దేశవ్యాప్త ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సీఐ బి.రాజేష్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు.

కురవి: ప్రజల సహకారంతో సమాజానికి భద్రత కల్పించనున్నట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలో 365 జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై సదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మరిపెడ: మరిపెడ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్సై బలగాని సతీష్‌గౌడ్‌తో పాటు ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: గార్ల మండలంలో పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కె.రియాజ్‌పాషా, హెడ్ కానిస్టేబుళ్లు శ్యామ్, తిరుమల్‌రావు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సిరాజ్, సూత్రపు శ్రీను, రాము, తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులపేట: యుద్ధ వాతావరణ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శుక్రవారం ఎస్సై మాలోతు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ట్రెయినీ ఎస్సై ఖాదర్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతలను మోసగిస్తున్న ప్రభుత్వం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



రైతులతో మాట్లాడుతున్న దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: అన్నదాతలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసగిస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని హరిపిరాల, కర్కాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం మాజీ మంత్రి దయాకర్‌రావు పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోళ్లు, ధాన్యం తరలింపులో జాప్యంపై జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరబ్రహ్మయ్యతో మాట్లాడగా రెండు లారీలు పంపించారు. కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. మాజీ మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కువ పంట పండిందని గొప్పలు చెప్పుకోవడం తప్ప రైతుల తిప్పలు పట్టించుకోవడం లేదన్నారు. ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో ఆలస్యంగా పడుతున్నాయన్నారు. ఎండలో ధాన్యానికి కాపలా ఉంటూ వడదెబ్బతో రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, నాయకులు ఈదురు ఐలయ్య, సుధీర్, కొండా వెంకన్న, జనార్దన్‌రాజు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టరును ఢీకొట్టిన కారు..

మహబూబాబాద్ రూరల్: ట్రాక్టరును కారు ఢీకొన్న సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలంలోని బాల్యతండా గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి శనిగపురం గ్రామం వైపునకు వెళ్తోంది. నర్సింహులపేట మండలం నుంచి ఓ కారు మహబూబాబాద్ వైపునకు వస్తోంది. ఈ క్రమంలో ట్రాక్టర్ శనిగపురం గ్రామ శివారులో గల చర్చి సమీపంలో కారు, ట్రాక్టరును ఢీకొట్టింది. ట్రాక్టర్, కారు ముందు భాగాలు దెబ్బతిన్నాయి. పలువురికి స్వల్పగాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం వారు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు బి.విజయసారథి, ఆకుల రాజు, పాయం చిన్న చంద్రన్న, గౌని ఐలయ్య, బొర్ర ఆనంద్, మధార్, కంచ వెంకన్న మాట్లాడుతూ.. మావోయిస్టులతో చర్చలు జరిపే వరకు పోరాటాలు ఆగవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, గునిగంటి రాజన్న, సమ్మెట రాజమౌళి, హెచ్ లింగ్యానాయక్, భాస్కర్‌రెడ్డి, నందగిరి వెంకటేశ్వర్లు, గుజ్జు దేవేందర్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, కొత్తపల్లి రవి, కుంట ఉపేందర్, భట్టు చైతన్య, హేమానాయక్, మామిండ్ల సాంబలక్ష్మీ, కట్లోజు పాండురంగాచారి, చొప్పరి శేఖర్, బందు మహేందర్, పామ్మన్న, శ్రావణ్, శంకర్, నక్క నాగార్జున, గుగులోతు కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మహబూబాబాద్ రూరల్: బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



మహబూబాబాద్ అర్బన్: ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కంబాలపల్లి జెడ్పీ, ఎంపీపీఎస్ పాఠశాలల హెచ్‌ఎంలు ఉప్పలయ్య, లక్ష్మి అన్నారు. మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయ బృందం శుక్రవారం బడిబాట ప్రారంభించారు. ఈసందర్భంగా కంబాలపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతు కుటుంబాల పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్, ఆవునూరి రవి, సువర్ణ, శ్రీజ, రైతులు పాల్గొన్నారు.

బయ్యారం: బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని ఉప్పలపాడులో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కొమిరె ఉప్పలయ్య, రత్తు, శ్రీను, భాష్‌సింగ్, సీఆర్పీ బాబులాల్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పించడంలో అందరి బాధ్యత అని గాంధీపురం పాఠశాల హెచ్‌ఎం గూగులోతు హోలియా నాయక్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధి గాంధీపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద శుక్రవారం బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, వెంకటేశ్వర్లు, భవాని, నవత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భారత సైనికులకు మద్దతుగా ర్యాలీ



మహబూబాబాద్ అర్బన్: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్, సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: భారత సైనికులారా మేమంతా మీ వెంటే ఉంటామని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా టీయూడబ్ల్యూజే143 వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం నుంచి నెహ్రూసెంటర్ వరకు కొనసాగింది. యుద్ధ సమయంలో భారతీయులంతా సైనికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈరగాని భిక్షం, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, లక్ష్మణ్, వెంకన్న, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి రాజు, సహాయ కార్యదర్శి రాజ్ కుమార్, కమిటీ సభ్యులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: భారత సైనికులకు ప్రతీ ఒక్కరు సంఘీభావం తెలపాలని బీజేపీ జిల్లా నాయకుడు మేరెడ్డి సురేందర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పాకిస్తాన్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, ఇండియన్ ఆర్మీకి, భారత ప్రభుత్వానికి మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, మోతీలాల్, సురేందర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై భారత సైనికులకు మద్దతు తెలుపుతూ శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలో వాకర్స్ అసోసియేషన్ కేసముద్రం విలేజీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పునూతల రమేష్, రావుల శ్రీనాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, వీరయ్య, సుధాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.



గూడూరు: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సంక్షిప్త సమాచారం

సమ్మెకు సహకరించాలి

మహబూబాబాద్: కార్మికుల హక్కుల కోసం ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెకు అందరూ సహకరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రవి, గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ అనుబంధ) జిల్లా అధ్యక్షుడు సుధాకర్ కోరారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం డీపీఓ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సోమనర్సయ్య, చరణ్, రవీందర్, వెంకన్న పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలో రాణి రుద్రమదేవి మినీ గూడ్స్ యూనియన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు కంచ వెంకన్న సమక్షంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా అజ్మీర్ రమేష్, ఉపాధ్యక్షుడిగా కాసు సాయి యాదవ్, కార్యదర్శిగా బానోత్ యాకూబ్, కోశాధికారిగా సాగర్, గౌరవ సలహాదారులుగా కనుకుల రాంబాబు, విజేందర్, నరేష్, కొమ్ము నరేష్‌లను ఎన్నుకున్నారు.

బ్రిడ్జి నిర్మించే వరకు పోరాటం

కురవి: మండలంలోని మోద్గులగూడెం శివారు బేగావత్ తండా గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు వెంటనే బ్రిడ్జిని నిర్మించాలని, లేని పక్షంలో బ్రిడ్జి నిర్మాణం జరిగే వరకు తండా వాసుల తరఫున పోరాటం చేస్తామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం తండాకు వెళ్లి ఆందోళనకారులకు మద్దతు పలికి వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బానోత్ దేవానాయక్, భగవత్, బాలాజీ నాయక్, నాగరాజు, గోపాల్, భూక్య రాజ్‌కుమార్, కళావతి, అరుణ, సుజాత పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

మహబూబాబాద్: ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పి.అశోక్ అన్నారు. శుక్రవారం ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ఆత్మహత్యలపై మూడురోజుల పాటు జరిగిన జాతీయ సింపోజియంలో జిల్లా కేంద్రానికి చెందిన అశోక్ పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో పరమేశ్వర్ ప్రతిభ



పెద్దవంగర: మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బిర్రు పరమేశ్వర్ గురువారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో అంతర్జాతీయ కవి సమ్మేళనం నిర్వహించగా కవితా గానం చేశాడు. సామాజిక అంశాలపై ఆయన చేసిన గానానికి ప్రశంసపత్రం అందజేసి, సన్మాంచారు.

కలుపు మొక్కల తొలగింపు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో జాతీయ సేవా పథకంలో భాగంగా వయ్యారి భామ కలుపు మొక్కలను ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు తొలగించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాజేంద్రప్రసాద్ గోపిక, ఎల్లస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జీవాల మృతి



నెల్లికుదురు: విద్యుత్ షాక్‌తో కాడెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని రత్తిరాం తండా శివారు హనుమంతు తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు గుగులోతు దామకు చెందిన కాడెద్దు తండా పరిధిలోని వ్యవసాయ పొలంలో మేత మేస్తున్నాయి. పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండటంతో మేత మేసుకుంటూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌కు గురై రూ.70వేల విలువ చేసే కాడెద్దు మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు.

మాకులతండాలో గేదె..

మరిపెడ: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకులతండా శివారులో చోటుచేసుకుంది. బాధితుడు బానోతు సుక్య రోజు మాదిరిగానే మేతకు వెళ్లింది. గురువారం రాత్రి వీచిన గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలను గేదె తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.70వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

స్కీంవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



నెహ్రూసెంటర్: అంగన్‌వాడీ, ఆశ, ఐకేపీ, వీఓఏ, మధ్యాహ్న భోజన వంటి స్కీంలలో పని చేస్తున్న కార్మిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి అన్నారు. జిల్లా కేంద్రంలో స్కీం వర్కర్ల సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఉపేందర్, రాజమౌళి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి దార స్నేహబిందు, అనురాధ, యాకమ్మ, రేణుక, ఉమ, రాధిక, ఉపేంద్ర, లక్ష్మీ, అరుణ పాల్గొన్నారు.